క్లుప్తంగా

సహజ వాయువు సామాజిక ఆస్తి

అమలాపురం టౌన్: సహజ వాయువు ప్రజలందరి సామాజిక ఆస్తి అంటూ గెయిల్ ఇండియా అన్వేషణ, కార్యకలాపాలపై అవగాహనతో కూడిన బుర్రకథ ప్రదర్శన స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో శనివారం సాయంత్రం నిర్వహించారు. బుర్రకథ కళాకారులు గొర్రెల రాము, కృష్ణ బ్రదర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో సహజ వాయువు పైపులైన్లు, వాటి రక్షణ, భద్రత ఏర్పాట్లు తదితర అంశాలపై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కోటిలింగం ఆధ్వర్యంలో విద్యార్థినులు, అధ్యాపకులు బుర్రకథను వీక్షించారు.

ఎంపీ అనురాధకు వినతి పత్రం



ఎంపీ చింతా అనురాధకు వినతి పత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘ నాయకులు

ముమ్మిడివరం: చేనేత సహకర సంఘ కార్మికులకు కేంద్ర ప్రభుత్వ హెచ్ఎస్ఎస్ పథకం వర్తింపజేయాలని కోరుతూ ఎంపీ చింతా అనురాధకు సంఘ ప్రతినిధులు శనివారం వినతి పత్రం అందజేశారు. పథకంలో ఒక్కొక్క లబ్ధిదారునికి షెడ్ నిర్మాణం నిమిత్తం రూ.1.20 లక్షలు మంజూరు చేస్తారని వివరించారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ కేంద్ర చేనేత జౌళి, శాఖ అధికారులతో మాట్లాడి పథకం వర్తించేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు శలా గురుమూర్తి, అంకం వీర్రాజు, వట్టూరి నారాయణరావు, దొడ్డిపట్ల వెంకట పట్టిలింగం, కార్మికులు పాల్గొన్నారు.

ఎంపీను కలిసిన అంబికా శ్రీను

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన మండలంలోని పెదగాడవిల్లికి చెందిన నిమ్మకాయల హనుమంతు శ్రీనివాసరావు(అంబికా శ్రీను) పార్లమెంటు సభ్యురాలు చింతా అనురాధను క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

98 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ జీవీ భవానీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సుంకరపాలెం జంక్షన్‌లో నిర్వహించిన దాడుల్లో గుంటూరు జిల్లా వడ్లమూడిపాలెం రొంపిచర్ల గ్రామానికి చెందిన గానుగపంట అశోక్‌రెడ్డి బైక్‌పై 98 మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకుని బైక్‌తో పాటు మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. దాడిలో ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నాడను కలిసిన మెరికల శ్రీను

అల్లవరం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అల్లవరం గ్రామానికి చెందిన మెరికల శ్రీను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పొన్నాడ సతీష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకటరామరాజు, ఎంపీటీసీ గుబ్బల రంగనాథస్వామి, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్‌రాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, అగ్నికుల క్షత్రియ తాలుకా అధ్యక్షుడు పెమ్మాడి సాయి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఆర్థిక సంఘం పరిధిలోకి పుదుచ్చేరి

యానాం: మిగిలిన రాష్ట్రాల తరహాలోనే కేంద్ర ఆర్థిక సంఘం పరిధిలోకి కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిని తీసుకునే దిశగా అడుగులు పడుతున్నాయని పుదుచ్చేరి ఉన్నతాధికారులు శనివారం తెలిపారు. కేంద్ర ఆర్థిక సంఘం పరిధిలో లేకపోవడం వల్ల పుదుచ్చేరికి కేంద్ర నిధుల కేటాయింపు ఉండడం లేదని, దీనివల్ల తాము ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఎప్పటినుంచో పుదుచ్చేరివాసులు డిమాండ్ చేస్తున్నారు. నవంబర్‌లో ఏర్పాటవుతున్న 16వ ఆర్థిక సంఘం ద్వారా ఏప్రిల్ 1, 2026 నుంచి 2030 వరకూ అన్ని రాష్ట్రాలకు ఆర్థిక సంఘ నిధులు రానున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్జీ తమిళిసై, సీఎం రంగసామి అభ్యర్థన మేరకు పుదుచ్చేరిని సైతం కేంద్ర ఆర్థిక సంఘంలోకి తీసుకోనున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు తెలుస్తుంది.

31న భూములకు కౌలు వేలం

కొత్తపేట: ఈనెల 31న పలివెల ఉమాకొప్పేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన పలు అంశాలపై, పలివెల ధర్మసత్రానికి చెందిన భూములకు కౌలు వేలం ని ర్వహిస్తున్నట్లు ఈవో ఎస్‌వీఎస్ఎస్‌వీ ప్రసాద్‌రాజు శనివారం తెలిపారు. స్వామికి భక్తులు సమర్పించే కొబ్బరికాయలు పోగు చేయుటకు, దేవస్థానం ప్రాంగణంలోని కొబ్బరి, మామిడిచెట్ల ఫలసాయానికి, అలాగే ధర్మస త్రం వెనుక భూములకు వేలం నిర్వహిస్తున్నామన్నా రు. మరిన్ని వివరాలకు దేవస్థాన కార్యాలయం వద్ద సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- నాడు–నేడుతో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు
- అల్లవరం మండలంలో రూ.4.89 కోట్ల నిధులతో మౌలిక సదుపాయాలు

అల్లవరం: ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను సమూలంగా మార్చేసి మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన నాడు–నేడు పథకాన్ని తీసుకొచ్చారు. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ నాణ్యమైన విద్యను పొందాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం నూరు శాతం అమలవుతుంది. కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం నవంబర్–2019లో నాడు–నేడు పథకానికి శ్రీకారం చుట్టింది. నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో తొమ్మిది రకాల మౌలిక సౌకర్యాలను కల్పిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టింది.

మారుతున్న రూపురేఖలు

శిథిలావస్థలో ఉన్న పాఠశాలను గుర్తించి తొలి విడతగా అల్లవరం మండలంలోని 16 పాఠశాలలకు రూ.1.17 కోట్లు నిధులు వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దారు. రెండో విడతగా మండలంలో మరో 40 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటికి రూ.3.72 కోట్లు నిధులు ఖర్చు చేయనున్నారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, ఫర్నిచర్, ప్రహరీగోడ, అదనపు తరగతి గదుల నిర్మాణం, రక్షిత తాగునీరు, ఇంగ్లిష్ ల్యాబ్‌ల ఏర్పాటు, పెయింటింగ్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. పాఠశాలల్లో బోధనా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణనిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించి విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచుతున్నారు. పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ, ప్రైవేటు స్కూల్స్‌పై పర్యవేక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



నాడు–నేడు తొలి విడతలో ఆధునీకరించిన బోడసకుర్రు పల్లిపాలెం ఎంపీపీ పాఠశాల

అల్లవరం మండలంలో నాడు–నేడు వివరాలు

తొలివిడతలో ఎంపికైన పాఠశాలలు : 16	మంజూరైన నిధులు : రూ.1.17 కోట్లు
రెండో విడతలో ఎంపికైన పాఠశాలలు : 40	మంజూరైన నిధులు : రూ.3.72 కోట్లు

మారుతున్న రూపురేఖలు



నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పన, తరగతి గదుల నిర్మాణం, ప్రహరీగోడల ఏర్పాటు తదితర పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్ని తీర్చిదిద్దుతున్నారు. అంతేకాదు శిథిలావస్థకు చేరిన పాఠశాలలు సైతం ఆధునీకరిస్తున్నారు.

– ఎస్.వేణుగోపాలస్వామి, ప్రధానోపాధ్యాయుడు, దేవగుప్తం

గణనీయంగా అభివృద్ధి



విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం ఈ తరహా విధానం అమలుచేయలేదు. కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో నాడు–నేడు ద్వారా రెండు విడతలుగా రూ.1.45 కోట్ల నిధులు వెచ్చించి మౌలిక సౌకర్యాలు కల్పించారు.

– పెనుమాల కనకదుర్గ భవాని, పేరెంట్స్ కమిటీ చైర్మన్, కొమరగిరిపట్నం

నీటి వనరులను రాబోయే తరానికి అందించాలి



నీటి సంరక్షణపై మాట్లాడుతున్న కవి దాట్ల దేవదానంరాజు

యానాం: మానవాళి ప్రకృతి ప్రసాదించిన నీటి వనరులను దుర్వినియోగం చేయకుండా సక్రమంగా వినియోగించుకుంటూ రాబోయే తరానికి అందించాలని ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక నవోదయ విద్యాలయలో వరల్డ్ వాటర్ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా నీటిసంరక్షణపై జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి స్థాయి నుంచే నీటి పొదుపుపై అవగాహన చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. అనంతరం తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాల, యానాం ఎస్‌టీసీపీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు నవోదయ పరిసరాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అఖిల భారత మహిళా కాన్ఫరెన్స్ కార్యదర్శి భానుమతి, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు, డాక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జార్జిపేట సర్పంచ్‌గా సత్యవేణి ప్రమాణ స్వీకారం



సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సత్యవేణిని సత్కరిస్తున్న నాయకులు

తాళ్లరేవు: మండల పరిధిలోని జార్జిపేట పంచాయతీ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన గుత్తుల సత్యవేణి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఉప ఎన్నికల్లో గెలుపొందిన సత్యవేణితో ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి ఎస్.వరలక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సత్యవేణిని మాజీ ఎంపీపీలు మందాల గంగ సూర్యనారాయణ, టేకుమూడి అనంతలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు తదితరులు పూలమాలతో సత్కరించి అభినందించారు.

ఎమ్మెల్యే పొన్నాడకు అభినందనల వెల్లువ

ముమ్మిడివరం/అమలాపురం టౌన్/అల్లవరం/ఐ.పోలవరం/ఉప్పలగుప్తం: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యునిగా నియమితులైన ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే పొన్నాడ ఇల్లు నాయకుల రాకతో శనివారం సందడిగా కనిపించింది. జిల్లాలోని వివిధ మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు వచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన అభిమానులు, ముమ్మిడివరం నియోజకవర్గ మత్స్యకార నాయకులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు శనివారం సాయంత్రం ఎమ్మెల్యే పొన్నాడను కలిసి అభినందించారు. ఎమ్మెల్యే పొన్నాడ దంపతులను అమలాపురంలోని వారి నివాసంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే పొన్నాడను అభినందించినవారిలో అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, పార్టీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, మున్సిపల్ కౌన్సిలర్లు దొమ్మేటి రాము, గొవ్వాల రాజేష్, చిత్రపు రామకృష్ణ, ఉప్పలగుప్తం జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, ఐ.పోలవరం ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ ఢిల్లీ నారాయణ, వైఎస్సార్ హార్టీకల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి తదితరులున్నారు.



ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు



ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ దంపతులను సత్కరించిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మల్లాడిని కలిసిన ఎమ్మెల్యే పొన్నాడ

యానాం: టీటీడీ బోర్డు మెంబర్‌గా ఎంపికైన ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ తన రాజకీయ గురువైన పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును శనివారం స్థానిక ఓల్డేజ్ హోమ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడను మల్లాడి కృష్ణారావు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మత్స చిట్టిరాజు, కోలా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పొన్నాడను అభినందిస్తున్న మల్లాడి కృష్ణారావు తదితరులు

విద్యార్థినులకు హైజనిక్ కిట్ల పంపిణీ

ఐ.పోలవరం: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో శనివారం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు హైజనిక్ కిట్లు పంపిణీ చేశారు. వసతి గృహంలో ఉన్న 60 మంది విద్యార్థినులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమకూర్చిన హైజనిక్ కిట్లను జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ ఢిల్లీ నారాయణ, వైస్ చైర్మన్ పిన్నంరాజు వెంకటపతిరాజులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాల్లో భాగంలో కిట్లు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.రాంబాబు, తహసీల్దార్ ఝాన్సీ లక్ష్మీకుమారి, ఇందుకూరి రంగరాజు, రేవు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు కిట్లు అందజేసిన రెడ్ క్రాస్ సభ్యులు

వెంకన్న ఆలయ అర్చకుల గృహాలకు విరాళం



ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవికి విరాళాన్ని అందజేస్తున్న దాతలు సురేష్ దంపతులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అర్చకుల గృహాలకు పట్టణానికి చెందిన కంకటాల సురేష్, జయమాధురి దంపతులు రూ.33,426 విరాళంగా సమకూర్చారు. ఈ మొత్తానికి చెందిన చెక్‌ను ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవికి దాతలు ఆలయంలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు యెండూరి రాఘవ నాగేశ్వరరావు, నడింపల్లి వర్మ, పట్టణ వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జంపన సుమన్‌వర్మ, ఆర్య వైశ్య నాయకులు కాళ్లకూరి బుజ్జి, ఎంకే రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

అమలాపురం రూరల్: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో టవర్లను పక్కకు జరుపుతున్నందున కోనసీమకు ప్రధానమైన 132 కేవీ పరిధిలోని కాకినాడ–రామచంద్రాపురం లైన్లలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ ఎం.జొన్నాదుల రామారావు, ఈఈ మోకా రవి కుమార్, ఈఈ వై.విజయానంద్‌లు తెలిపారు. ముమ్మిడివరం, అమలాపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

గ్రూప్–1 విజేత భానుప్రకాష్‌రెడ్డికి సత్కారం

ఉప్పలగుప్తం: ఏపీపీఎస్సీ గ్రూప్–1 ఫలితాల్లో ఐదో ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన అనాతవరం సర్పంచ్ మిమ్మితి చిరంజీవి కుమారుడు భానుప్రకాశ్‌రెడ్డిని శనివారం కూనవరంలో ఘనంగా సత్కరించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు కాత్రు ధనలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు ఊటాల రామాంజనేయులు కలిసి భానుప్రకాశ్‌రెడ్డికి దుశ్శాలువా కప్పి పూలమాలలు వేసి అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాత్రు కృష్ణ, బూసి సత్యనారాయణ, కుంచే బాబులు, వాకపల్లి సత్యనారాయణ, ఆకుల చెంచయ్యనాయుడు, నాగిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన భానుప్రకాశ్‌రెడ్డిని సత్కరిస్తున్న కూనవరం గ్రామస్తులు

మదర్ థెరిసా నిలువెత్తు సేవారూపం

అమలాపురం టౌన్: నిర్మల హృదయానికి, మానవత్వానికి మదర్ థెరిసా నిలువెత్తు సేవా రూపమని జిల్లా చేతివృత్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి అన్నారు. శనివారం మదర్ థెరిసా జయంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ మార్గ్ కాటన్ పార్కులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదర్ థెరిస్సా సేవలను నేటి సమాజంలో అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, షేక్ కరీముల్లా, కందాళ సూర్యనారాయణ, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి

తాళ్లరేవు: భారతరత్న మదర్ థెరిసా జయంతి సందర్భంగా స్థానిక సామాజిక ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న థెరిసా విగ్రహానికి తాళ్లరేవు, గొల్లపాలెం లయన్స్‌క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 20 మంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి అందజేసినట్లు ఆస్పత్రి డైరెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు వేలూరి సూరిబాబు, వినోద్, దత్తు, సతీష్, రామరాజు, సూర్యనారాయణరాజు, రెడ్డి రెడ్డిబాబు, ఆకుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో మదర్ థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు



మదర్ థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా చేతివృత్తుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు పనులు

కాట్రేనికోన: బ్రహ్మ సమేధ్యం పంచాయతీ మగసానితిప్ప గ్రామంలో వేంచేసి ఉన్న కాలభైరవ స్వామి ఆలయంలో నూతన ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు పనులను సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు శనివారం పరిశీలించారు. ఆలయంలో నూతన ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు వేయించేందుకు బలుసుతిప్ప, మగసానితిప్ప, కొత్తపాలెం, నీళ్ళరేవు గ్రామస్తులు కలిసి నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో మల్లాడి ఆది నారాయణ, ఓలేటి సతీష్, తిరుమాని సత్తిబాబు, సంగాని చిన్ని, ఇసుకపట్ల శ్రీనుబాబు తదితరులు ఉన్నారు.



నూతన ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ ఏడుకొండలు

ఎఫ్‌సీఐ కార్యాలయ సందర్శన



ఎఫ్‌సీఐ డిపో కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

అమలాపురం రూరల్: భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) పేరూరు డిపో కార్యాలయాన్ని, ఎఫ్‌సీఐ గొడౌన్‌ను పేరూరు హైస్కూల్ విద్యార్థులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ మేనేజర్లు పి.మధుబాబు, జె.ప్రభాకర్, ఎ.వెంకటేష్, బి.గణపతిలు మాట్లాడుతూ బియ్యం సేకరణలో ఎఫ్‌సీఐ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. నాణ్యమైన బియ్యం సేకరణలో ఎఫ్‌సీఐ పాటించే పద్ధతులు, నాణ్యతా ప్రమాణాలను పరీక్షించే విధానాలు, ఫోర్టిఫైడ్ బియ్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

నేడు ఎల్‌డీసీ పరీక్ష

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 165 లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), 55 స్టోర్ కీపర్ పోస్టులకు ఈ నెల 27న నిర్వహించనున్న రాత పరీక్షకు 46,904 మంది హాజరుకానున్నారని అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్‌శాఖ కార్యదర్శి జయశంకర్ శనివారం తెలిపారు. యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిల్లో మొత్తం 137 రాత పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష నిర్వహణకు 3 వేల మంది ఇన్విజిలేటర్స్ తదితర సిబ్బందిని నియమించామని చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి బ్లాక్ పాయింట్ పెన్, హాల్‌టికెట్, ఒరిజినల్ ఐడెంటీ కార్డు తప్ప ఇంకేమీ అనుమతించమన్నారు. యానాంలో మొత్తంగా 2,835 మంది హాజరవుతున్నారని, వీరి కోసం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

రాకెట్, రోవర్ మోడల్స్ ప్రదర్శన



సమనసలో రాకెట్, రోవర్ మోడల్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: ఇస్రో ప్రయోగించిన విక్రమ్ ల్యాండర్ జాబిల్లి ఉపరితలంపై విజయవంతంగా దిగిన సందర్భంగా సమనస శ్రీరామా పబ్లిక్ స్కూల్‌లో రాకెట్, రోవర్ మోడల్స్ ప్రదర్శించారు. స్వయంగా విద్యార్థులు తయారు చేసిన మోడల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రదర్శన అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీగణేష్, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి పాల్గొన్నారు.